# గడియారం ఆగిపోయింది

—ఇచ్ఛాపురపు రామచంద్రం

ఆ ప్రాణులు కూడా ప్రేమించగలవేమో అని నా అనుమానం ఎందుకంటే— గోపాలం పెన్ అతనికి తప్ప మరెవరికీ రాయదు శేఖరం సైకిలు మరెవరయినా తొక్కబోతే కదలదు మొండికేస్తుంది మొరాయిస్తుంది పట్టుదలగా ఎక్కారో పడదోసి తీరుతుంది ఇవన్నీ చూస్తే— కొన్ని వస్తువులు తమ యజమానులను ప్రేమించి-వారికి తప్ప యితరులకు సేవ చేయడానికి నిరాకరిస్తాయనినమ్మకతప్పదు ఇదోరకం ప్రేమ పాతివ్రత్యమూ కావొచ్చు గోపాలానికి రాసేపెన్ను మరొకరి కెందుకు రాయదు? శేఖరం సైకిలు మరొకరెక్కితే ఎందుకు పరుగెత్తదు?

* * *

అప్పటికి నాకు పన్నెండేళ్ళో పదమూడేళ్ళో స్కూల్లో చదువుకునేవాడిని మాయింట్లో మాఅమ్మా నాన్నా తమ్ముడూ చెల్లీ వుండేవాళ్ళం నాన్నగారిది-నాకర్థం కాని వ్యాపారం మా యింటికి ఎవరెవరో వచ్చి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని నాన్నగారితో మాట్లాడి వెళ్ళేవారు వాళ్ళలో కొందరు చాలా గొప్పవాళ్ళయి ఉంటారు కార్లలోకూడా మా యింటికి వొచ్చేవారు ఇంగ్లీషులో మాట్లాడేవారు నాన్నగారిది కొంతవరకు దొరల పద్ధతి ముఖ్యంగా డిసిప్లిన్ విషయంలో మిగిలిన యిల్లు ఎలావున్నా మా డ్రాయింగ్ రూమ్ మాత్రం చాలా ఆధునికంగా ఉండేది. నాన్నగారు నన్ను యింజినీరుని చెయ్యాలనుకుంటూండేవారు

నా పరీక్షలౌతున్నాయి పల్లెటూరు నుంచి-మా తాతగారు చనిపోయారని కబురు వచ్చింది నన్ను మాత్రం వొదిలేసి అందరూ అక్కడికి వెళ్ళిపోయారు పదిహేను రోజులు పోయాక కానీ రాలేదు మా అమ్మ నాన్నగార్లతోపాటు మా బామ్మ కూడా వచ్చింది. బామ్మంటే మా నాన్నగారి అమ్మ

బామ్మంటే మాకు చాలా యిష్టమూ సరదా అందుకనేక కారణాలున్నాయి బామ్మ చేగోడీలు చేయడంలో ఛాంపియన్ పప్పు చేగోడీలు కొయ్య చేగోడీలు సన్నగా, లావుగా, రకరకాలుగా చేసెయ్యగలదు ఒకసారి చేగోడీలు చేసిందంటే యింట్లో వారంరోజుల వరకూ అదే కాలక్షేపం టిఫిను చేగోడీలు తింటూ చదువుతుంటే పాఠాలు బాగా బుర్రకెక్కుతాయని నా నమ్మకం అదీకాక బామ్మ చేత్తో చేగోడీలు చేసిందంటే—చేసిన నాడెంత కరకరలాడతాయో ఆఖరయ్యేవరకూ అంత క్రిస్పుగానూ వుండవలసిందే ఆ టెక్నిక్

బామ్మకే తెలుసు

మా యింట్లో కొంచెం దొరల పద్ధతని చెప్పానుగా అందుకని ఎప్పుడూ బాతులూ (బాత్‌లు) పుడ్డింగ్‌లూ తప్ప చేగోడీలు అవీ చెయ్యరు మా అమ్మకి—తప్పు—మమ్మీకి—చేతకావట కొనుక్కు తిందామన్నా డాడీకి తెలిస్తే పెద్ద పనిష్‌మెంట్ యిచ్చేస్తారన్న భయంతో వాటి జోలికి పోయేవాళ్ళం కాము


బామ్మ రావడం నాకు చాలా ఆనందం కలిగించింది ఎందుకంటే మేమెంతో భయపడే మా డాడీ ముందు బామ్మకస్సలు భయంలేదు! డాడీ-మమ్మీనిలా బామ్మని దెబ్బలాడడు పైగా బామ్మే డాడీని కోప్పడుతున్నట్లు మాట్లాడెయ్య గలదు మేం-పిల్లలం ఆశ్చర్యంగా చూస్తే "రాజ్యానికి రాజు కానీ అమ్మకు కొడుకే కదూ?" అని నవ్వేది డాడీచేత తిట్లు తినే మాకు-డాడీ కూడా బామ్మచేత దెబ్బలాడించుకుంటూంటే బలేగా వుండేది

బామ్మ వస్తూ విచిత్రమయిన సామానులు కొన్ని తెచ్చింది మొదటిది దేముడు పెట్టె తమాషాగా వుండేది డయాస్ మీద సోఫాలో ఒక ఆడ దేవుడూ ఓ మగ దేవుడూ సోఫా అనకూడదట అది సింహాసనమట డయాస్ కాదుట పీఠమట మాకెలా తెలుస్తాయి? మా యింట్లో దేముడు లేడుగా?

అంత వరకూ మేము పాత సామానులూ పనికిరాని సామానులూ పడవేసే మూలగది - చిన్నది-కాళీ చేసి బామ్మకప్పగించాం ఏమిటేమిటో మూటలు ఓ బొక్కి ట్రంకుపెట్టె బామ్మ అతి జాగ్రత్తగా తెచ్చిన ఒక మూట విప్పింది అదో కర్రపెట్టెలా వుంది

"ఏమిటి బామ్మా?"

"చూద్దురు గానర్రా " అంటూ ముడులు విప్పి ఆ వస్తువును బయట పెట్టింది జాగ్రత్తగా చీర కొంగుతో తుడిచింది (బామ్మలు కట్టుకునేవాటిని చీరలనకూడదట పంచెలనాలిట అదేమిటో పంచెలు మగవాళ్ళు కొందరు కట్టుకుంటారు కానీ ఆడవాళ్ళూ కట్టుకుంటారా?) దాని మీదకు వొంగి నాలుగు వేపులూ బుగ్గలు పూరించి ఊదింది తీరా చేస్తే అదొక గోడగడియారంలా కనిపించింది మా యింట్లో మా నాన్నకీ అమ్మకీ నాకూ వాచీలున్నాయి కానీ గోడగడియారం మాత్రం లేదు దొరల యిళ్లల్లో గోడ గడియారా లుంటా



యేమో కాని దొరల్లా వుందామనుకునే వాళ్ళ యిళ్ళల్లో గోడ గడియారాలుండవు కాబోలు గోడ గడియారం మేము చూడకపోలేదు కానీ అంత దగ్గర నుండి చూడడం అదే మొదటి సారి ఉత్సాహం కొద్దీ ముట్టుకోబోతే—

"వద్దు నాన్నా పాడైపోతుంది" అంది బామ్మ

నేను ముఖం చిన్న బుచ్చుకోగా—

"గోడకి తగిలిస్తానుగా? నీ యిష్టమొచ్చినంత సేపు చూద్దువుగాని గంటలు కొడుతూంటే తమాషాగా విందువుగాని ఏం?" అని బుజ్జగించింది బామ్మ

"ఏ గోడకి? ఈ గదిలో గోడకి తగిలిస్తే ఏం కనబడుతుంది? ఎవరికి కనబడుతుంది?"

"ఛీ! గోడగడియారం మూల గదుల్లో తగిలిస్తానా? హాల్లో తగిలిస్తాను"

"హాల్లోనే!?"

ఆనందంగా వుంది నాకు ఆశ్చర్యంగా వుంది మా యింటి మొత్తానికి ప్రత్యేకంగా ఉండేది మా డ్రాయింగ్ రూమ్ అది-నాన్నగారి స్వంతం ఆ రూములో ఏ వస్తువయినా పెట్టాలన్నా తీయాలన్నా కదపాలన్నా నాన్న అంగీకరిస్తేనే నాలుగు గోడలకీ కలిపి రెండే బొమ్మలుంచాడు డాడీ ఒకటి క్యాలండరున్నది రెండోది ప్రకృతి చిత్రం గొప్ప(వాళ్ళ) గోడలకు ఎక్కువ చిత్రాలుండకూడదు మరి-గోడ గడియారం ఉండొచ్చునా?

"బామ్మా ఈగడియారం ఏ మ్యూజియందీ?"


నేను ఆ ప్రశ్న ఊరికే అడగలేదు. చుట్టూవున్న కర్రబోర్డరు పెచ్చులూడిపోతోంది పెయింట్ సంగతి సరేసరి పుట్టాక మళ్ళీ పెయింట్‌కి నోచుకోనట్లుంది ఇక డయలు దోమల గుడ్లూ మచ్చలూ ధూళీ గాజుకంటుకుపోయి ఊడొచ్చేట్లుగా లేవు గాజు అద్దం నల్లగా ఐపోయింది అదీగాక ఆ గడియారం డయలు మీద అనాగరికంగా ఒకటి. రెండు, మూడు-అలాగ పన్నెండు అంకెలు వేసివున్నాయి నాగరీకపు గడియారాలలో నాలుగు గీతలేగా? పైగా-పెండ్యులమ్ ఒక దిమ్మలా ఉంది పెండ్యులం ముందరిఅద్దం కూడా మాసిపోవడంతో ఆ పెండ్యులమ్ కదలికలు ఓ పట్టాన కనపడవు ఇంకా అనాగరికంగా గడియారం టంగ్ టంగ్ మని మొట్టికాయలు పెట్టినట్లు గంటలు కొడుతుందట! ఆ గడియారపు గంట వింటే మా తాతగారి కంచుగంటలాటి కంఠమే వినిపించినట్లుంటుందట బామ్మకి

నా ప్రశ్న బామ్మకి సరిగా అర్థం కాలేదు కాబోలు జవాబు మరోలా చెప్పింది

"మద్రాసులో కొన్నాంరా దీన్ని! ఎప్పుడనుకున్నావ్? మా పెళ్ళయిన కొత్తలో మీ తాతగారు ఏదో పనిమీద వెడుతూ నన్నూ తీసుకెళ్ళారు చెన్నపట్నం"

"నువ్వు మద్రాసు వెళ్ళావా బామ్మా!? మరి నీ మడీ అదీ ఎలా కుదిరాయి?"

"ఏం చేసేది? నీళ్ళు తాగేముందు కుళాయి కడిగేదాన్ని అప్పుడు కుళాయి కడిగి మణ్ణీళ్ళు పట్టుకునేదాన్ని ఏం చేస్తాం? పేద్ద చెన్నాపట్నం అనుకోడమే కాని బొత్తిగా మడీతడీ ఆచారమూ కుదిరి చావవనుకో"




"ఓహో! మరి మీరు బంధువులింట్లో దిగలేదూ?"

"లేదురా! మీ తాతగారు హోటల్లో దింపారు"

"మరి అడ్డమైన వాళ్ళూ వొండుతారు కదా హోటల్ భోజనం ఎలా చేశావు?"

"చేశానా? లేదు అక్కడున్న మూడ్రోజులూ పళ్లూపాలతోనే గడిపాను అందుకే వారం రోజులుందామనుకున్న తాతగారు మూడో రోజునే ప్రయాణం కట్టారు స్టేషన్‌కి వస్తూ మూర్‌మార్కెట్లో కొన్నాం దీన్ని"

గోడగడియారాన్ని హాలులో గోడకి తగిలిస్తాననగానే అంతెత్తున ఎగిరాడు నాన్న సనేమిరా వీల్లేదన్నాడు బామ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంది

"వొద్దమ్మా నలుగురూ వచ్చి కూర్చునే గది యిది గోడలుచూడు ఎంత చక్కగా ఉన్నాయో! ఆ గోడమీద యీ గడియారం ఏంబాగుంటుంది?"

"ఔనురా నాయనా! మీ ముందు నేనూ బాగుండను ముసిలిదాన్నీ మురికి దాన్నీ నన్నూ యింట్లోంచి తరిమెయ్"

ఇంక నాన్న ఓడిపోయాడు అయిష్టం గానే ఊ అన్నాడు బామ్మ సంతోషంగా గడియారం పట్టుకొచ్చి - మేకు తెచ్చి నాన్నచేతే గోడకి కొట్టించింది ఆ గోడ మీద తన గడియారాన్ని చూసి మురిసి పోయింది

నిజానికి - ఆ గడియారం - ఆ హాలు గోడకి దిష్టి బొమ్మలా ఉంది వెక్కిరిస్తో న్నట్లుంది షడ్భుజో అష్టభుజో ఆకా రంలో ఉన్న కర్ర ఫ్రేము - నవ్వుతెప్పిం చేదిగా ఉంది

"ఇంకా ఆ గడియారం ఎందుకు బామ్మా? ముసిలిదై పోయింది ఏ మ్యూజి యమ్‌కో యిచ్చేస్తే మన పేరు చెప్పు కుంటారు నీకు కావాలంటే నాన్న రిస్టు

వాచీ కొనిపెడతారు " అన్నాం పిల్లలం

"నేనూ ముసిలిదాన్నే నన్నూ పారే స్తారా?"

"నువ్వు మాక్కావాలి బామ్మా నువ్వూ గడియారమూ ఒకటేనా?"

"మీకు నేను కావాలి నాకు గడియారం కావాలి " అంటూ నవ్వేసి - అంతలోనే కన్నీళ్లు పెట్టుకుని — "ఆ గడియారాన్ని చూసుకుంటూంటే మీ తాతగారే గుర్తు కొస్తార్రా " అంది అంతలోనే ఏదో జ్ఞాపకం వచ్చినట్లు — "మీ తాతగారుంటే మీ మాటలు విని ఎంత సంతోషించే వారో!" అని మమ్మల్ని దగ్గరకు తీసు కుంది

అమ్మ వంటవేరు బామ్మ వంటవేరు బామ్మకి మడికావాలి తను వండుకునే వంటలూ ఆ రుచులూ వేరు రాత్రిళ్ళు ఉప్పుపిండో, రొట్టిలో గేసుకుని - తనతో పాటు మాకూ పెట్టేది ఇంగ్లీషు సూపులూ అవీ ఎందుకు పనికొస్తాయి బామ్మకాచే కాకరాకు బెల్లప్పులుసు ముందు? మేము- పిల్లలం దొంగతనంగా బామ్మదగ్గరకు చేరేవాళ్ళం తనకోసం కాకపోయినా మా కోసం రకరకాల వంటలు చేసేది

గోడగడియారం హాల్లో పెట్టాక— నాన్నకి తరచూ విసుగూ కోపమూ వచ్చేవి

వ్యాపార విషయాలు మాట్లాడుకుందుకు వచ్చిన వాళ్ళు - గోడగడియారాన్ని చూస్తూ కూర్చునేవారట పరధ్యానంగా కొందరయితే బిజినెస్ మరచిపోయి ఆ గడియారం గురించి ఆరాలు తీసేవారు ఎక్కడకొన్నారు? ఎప్పుడు ఎంతధర? ఇన్నేళ్లూ మాకు కనిపించనివ్వలేదేం?— ఇలాటి ప్రశ్నలు వేసేవారట

హాల్లో గడియారం గంటలు కొట్టడం భయం, బామ్మ అక్కడికి పరిగెత్తుకెళ్ళి అది గంటలు కొట్టడం పూర్తిచేస్తే కాని వచ్చేదికాదు లోపలికి నాన్న-తను చెప్ప లేక మాచేత చెప్పించబోయాడు

"బామ్మా! నువ్వు - హాల్లో నాన్నకాక ఎవరయినా ఉన్నప్పుడు వెళ్ళకు బాగుం డదు "

"ఏం?"

"అక్కడ మగాళ్ళుంటారు కదా "

''ముసలిముండను నేనింకా సిగ్గు పడటం ఎందుకర్రా?''

"అదికాదు ఎవరేనా వున్నప్పుడు— పిలవకుండా మనం ఆ గదిలోకి వెళ్ళడం-"

"మనింట్లో మనం తిరగడాని కొకరి అడ్డేమిటి?"

"అదికాదు బామ్మా నువ్వు పెద్ద దానివి కదా? గడియారం గంటలు కొడు తూంటే వింతచూస్తున్నట్లు నిలబడితే— ఎవరయినా ఏమయినా అనుకుంటారు "

"ఏడిశారు'" నవ్వేసి - అంతలోనే గంభీరంగా ఐపోయి — "గడియారం గంటలు కొడుతూంటే మీ తాతయ్య పిలు స్తున్నట్లే ఉంటుంది పిలవగానే వెళ్ళక పోతే మీ తాతయ్య కెంత కోపం అను కున్నారు' మీకు బాగా తెలియదులెండి" అనేసింది ఇంకేమనగలం మేము'

కార్తీకమాసం వచ్చిందంటే మా పిల్ల లకి బలే ఉషారు తెల్లవారుజామున లేపి మమ్మల్ని నదివొడ్డుకి తీసుకుపోయేది మొదటిసారి మునిగేటంతవరకూ చలి ఓ మునక వేశామో - మరి నీటిలోంచి


రా బుద్ధి వేసేదికాదు ఆ నీళ్ళు వెచ్చగా అమ్మలాగ కౌగలించుకొనేవి చీకట్లో నడవడం ఎంత బాగుండేది! జోళ్ళులేని కాళ్ళకి నేల తగులుతూంటే మహాబాగుందేది ఏకార్పెట్‌మీద నడిస్తే అంత హాయిగా ఉంటుంది?

బామ్మమీదలాగే గడియారంమీదకూడా మాకు అభిమానం పెరుగుతూంది రాత్రులు మాకు దేముళ్ళ కధలూ రాజుల కధలూ చెప్తున్నప్పుడు, కధ మంచి రస పట్టులో ఉండగానయినా సరే-గడియారం గంటలు కొట్టిందంటే చాలు వెళ్ళి గంటలు విని వచ్చేది బామ్మ

నేను పెద్దవాడినౌతున్నాను నన్ను ఇంజనీర్‌ని చెయ్యాలని మా నాన్న సంకల్పం అందుచేత సాయంత్రాలు నన్నొక మెకానిక్ దగ్గరకు పంపేవాడు ఆ మెకానిక్ గడియారాలు బాగుచెయ్యడం దగ్గర నుంచి మరెన్నో బాగుచెయ్యడం వరకూ నేర్పేవాడు ఈ రిపేర్లకి నేను చదవబోయే యింజనీరింగుకీ ఏమయినా సంబంధం ఉంటుందో ఉండదో నాకు తెలియదు

"బామ్మా! మన గడియారానికి ఓవర్ హాలింగ్, పెయింటింగూ అన్నీచేస్తాను డయల్ కొత్తదివేస్తాను లేకపోతే— కాగితం మాసిపోయి అంకెలు బొత్తిగా కనపడడం లేదు"

బామ్మ మందలిస్తున్నట్లు చూసి— నవ్వుతూ—"దానికీ నాకూ రిపేరెందుకురా? నేనొక్కనాడు జీర్రున చీది ఎరగను ఆ గడియారమూ అంతే ఒక్కనాడూ ఆగలేదు టైమయ్యేసరికి దాని గంటలది



కొట్టేసుకోడమే అది కొన్నాక యిన్నాళ్ళ వరకూ మరామ్మత్తు అడగలేదు మరిచిపోకుండా వారానికోసారి కీయిస్తే దానికదే పదివేలు-" వారానికి కీ యివ్వడం - అదో హడావిడి నిచ్చెన వేసుకుని స్వయంగా కీ యిచ్చేది నానా యాతనలు పడి అంతే తప్ప మమ్మల్ని ముట్టుకోనిచ్చేదికాదు బామ్మ బల్ల ఎక్కలేదు నిచ్చెన వేస్తే— డిస్టెంపర్ చేసిన గోడలు పాడౌతాయని నాన్నకి కోపం

మా చేత ఒట్టు వేయించుకుంది-మేము గడియారం ముట్టుకోకుండా బామ్మకీ ఆ గోడ గడియారానికీ అంతలంకె!

నేను పెద్దవాడినౌతున్నాను రిపేర్లలో చాలా నేర్చుకున్నాను వాచీలు, గడియారాలు, మోటారు సైకిళ్ళు - ఇలా చాలా వాటికి నేను మంచి డాక్టర్నని పేరు తెచ్చుకున్నాను వయస్సుకి చిన్నవాణ్ణే ఐనా వాచీలూ, మిషన్లూ కొనేముందు నాణ్యత పరిశీంచడానికి నన్ను తీసుకు వెళ్ళేవారన్నమాట నేను ఇంజినీరింగ్‌లో చేరబోయేముందే యీవిధంగా కన్‌సల్టెంట్ నయిపోయాను

* * *

ఆ సాయంత్రం - నేను వర్క్‌షాప్ నుంచి వచ్చాను ఇల్లు హడావిడిగా ఉంది తమ్ముడు వచ్చిచెప్పాడు "బామ్మ చచ్చిపోయింది?"

"ఆ!" అంటూ పరుగెత్తాను బామ్మని చాపమీద పడుకోబెట్టారు అమ్మా నాన్నా విచారంగా కూర్చున్నారు అరు బయట బామ్మ నిద్రపోతున్నట్లుంది గానీ చచ్చిపోయినట్లు కనిపించడమేలేదు

బంధువులు వచ్చారు "ఎప్పుడు చచ్చిపోయింది?"

"సరిగ్గా నాలుగు గంటలకి "

నాకేదో ఆలోచన వచ్చింది హాలులోకి పరుగెత్తాను నా అనుమానం నిజమే ఐంది

గోడి గడియారం ఆగిపోయి ఉంది- సరిగ్గా నాలుగు గంటలకి!

హాలులో ఎవరూలేరు త్వర త్వరగా గడియారాన్ని దింపేశాను

నాలుగు గంటలకి గడియారం ఆగిపోయింది

నాలుగు గంటలకి బామ్మ చనిపోయింది

గడియారం ఆగిపోయిందని బామ్మ చనిపోయిందా?

బామ్మ చనిపోయిందని గడియారం ఆగిపోయిందా?

ఏదికారణం, ఏదిఫలితం?

నన్నెవరూ పట్టించుకోడంలేదు గడియారాన్ని పట్టుకున్న నా చేతులు ఒణుకుతున్నాయి తప్పుచేస్తున్నప్పటిలా దొంగలాగ గడియారం పట్టుకుని నా గదిలోకి నడిచాను

ఆ గడియారపు దయలులో బామ్మే కనిపిస్తూంది

గుండె చిక్కబట్టుకుని - మెల్లగా స్క్రూతో నట్లు విప్పాను ఆ గడియారంలో- సాలీళ్ళు బొజ్జింకలు ఇంకా ఏవో పేరు తెలియని పురుగులు

మెల్లిగా ఒక్కొక్క భాగమూ వేరు చేశాను

నా జ్ఞానంమీదా, సమర్థతమీదా నాకే అవిశ్వాసం కలిగిందొక్కసారి

ఆ భాగాలు ఎంతమాత్రమూ మంచివి కావు అవి-ఇన్నాళ్ళు రిపేరుకూడా అడగకుండా ఎందుకు పనిచేశాయో అనూహ్యం గడియారం హటాత్తుగా ఆగిపోడానికీ కారణం కనిపించదు

ఆ గడియారాన్ని రిపేరు చేద్దామన్న ఊహ నాకు రాలేకపోలేదుగానీ—ఏం లాభం? ప్రేమ దయలు స్ప్రింగులు ప్రతిభాగమూ కొత్తవి వేయాల్సిందే

నా ప్రశ్నకి జవాబు దొరకనేలేదు,

గడియారం ఆగిపోయిందని బామ్మ చనిపోయిందా?

బామ్మ చనిపోయిందని గడియారం ఆగిపోయిందా?

ఏదిముందు? ఏదివెనుక?

ఏదిసత్యం? ఏదసత్యం?



జ్యో